తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
1 ఫిబ్రవరి 2026
Follow :



# జీహెచ్ఎంసీ మెగా బడ్జెట్‌కు ఒకే జై

## బల్దీయా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

### అభివృద్ధికి రూ.11,460 కోట్లు

- విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల అవసరాలు పరిగణనలోకి
- భిన్నాభిప్రాయాల నడుమ చివరి సమావేశం ముగిపు
- మేయర్ గద్వాల విజయలక్ష్మి భావోద్వేగ ప్రసంగం
- దివంగత కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డికి సంతాపం

**బడ్జెట్ కీలక అంశాలు**

వివిధ మార్గాల్లో వచ్చిన ఆదాయం : రూ.6,441 కోట్లు
జీహెచ్ఎంసీ ఖర్చు : రూ.4,057 కోట్లు
రెవెన్యూ మిగులు : రూ.2,384 కోట్లు
రెవెన్యూ గ్రాంట్స్ : రూ.400 కోట్లు
విలీనమైన 27 మున్సిపాలిటీల కోసం కేటాయింపులు : రూ.2,260 కోట్లు
విలీన 27 మున్సిపాలిటీల నుంచి వచ్చిన రెవెన్యూ : రూ.1,860 కోట్లు
గత ఆర్థిక సంవత్సరం (2025-26) రూ.10,714.73 కోట్ల బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి రూ.745.27 కోట్లు పెంచి రూ.11,460 కోట్లతో రూపొందించారు.

GHMC
1
వార్షిక బడ్జెట్
2026-27

**హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి):**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పాలక మండలి 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.11,460 కోట్ల మెగా బడ్జెట్‌కు శనివారం ఆమోదం తెలిపింది. గ్రేటర్ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగియను ఉడటంతో జరిగిన చివరి కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌కు ఆమోద ముద్ర వేశారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం భావోద్వేగాలతో కూడుకుని ఉంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బడ్జెట్ ముసాయిదాను కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. ఇటీవల విలీనమైన 27 పట్టణ స్థానిక సంస్థల అవసరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనులను పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ రూపొందించారు.

**సమావేశంలో ఉద్రిక్తత, సమస్యల వాణి**
సమావేశంలో వివిధ పార్టీల కార్పొరేటర్ల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్ కార్పొరేటర్లు కేసీఆర్ హయాంలో జీహెచ్ఎంసీ అప్పుల పాలైందని, ➤లోపలి పేజీలో



➤ మెయిన్‌లో..

# లాల్‌పాడ్‌లో 'మృత్యు'కుహరం

## సూర్య హాస్పిటల్ ముసుగులో నకిలీ డాక్టర్ల దందా

- డాక్టర్ ఒకరు.. వైద్యం మరొకరు
- ఆర్ఎంపీల చేతిలో పసిపిల్లల ప్రాణాలు
- (ఎ-) రక్తాన్ని (బి-)గా మార్చి డ్రామాలు
- సీజ్ అయిన హాస్పిటల్ నుండి మకాం మార్చిన నకిలీ డాక్టర్ మల్లేష్

లాల్‌పాడ్ (పొదర్‌గూడ),జనవరి 31 (జనంసాక్షి) :

**అనుమతి లేని ల్యాబ్.. అన్నీ అక్రమాలే**

**నకిలీ డాక్టర్ 'మల్లేష్' మళ్ళీ ప్రత్యక్షం**

**తక్షణమే సీజ్ చేయాలి : బాధితుల డిమాండ్**

# శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో టెండర్ల దందా?

- అర్హులకు కాదని అనుయాయులకు టెండర్!
- టెండర్ గోల్మాల్‌లో భారీగా చేతులు మారిన ముడుపులు...!?




## మైనర్ బాలిక మృతికి..

# కారకులను అరెస్టు చేయాలి

**ట్రాక్టర్ కింద పడి మైనర్ బాలిక మృతి**

- పొలం పనులకు వెళ్లిన 15 ఏళ్ల బాలిక
- 80 వేల ఇచ్చి.. శవం తీసుకెళ్లండని బెదిరింపులు
- బాల కార్మిక చట్టం ఉల్లంఘించారని ఆరోపణ
- కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నా...అంబేద్కర్ సంఘం






# నిర్మలమ్మ కరుణిస్తుందా?

## హైదరాబాద్‌పై వరాలు కురిపిస్తుందా?

- నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశం.. తెలంగాణకు కోటి ఆశలు
- మెట్రో ఫేజ్-2, మూసీ పునరుద్ధరణ, ట్రిపుల్ ఆర్‌కు నిధులు కీలక డిమాండ్
- గత బడ్జెట్లలో హైదరాబాద్‌కు ఒక్క పైసా లేదు.. ఈసారి కరుణ చూపేనా?
- గ్రేటర్‌లో బీజేపీ ఎంపీలు.. జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో కీలక అవకాశం

# ఘనంగా యువ నాయకుని జన్మదిన వేడుకలు



**బీఆర్ఎస్ యువ నాయకులు పబ్బ సంపత్ కుమార్**

**తలకొండపల్లి జనవరి 31(జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పబ్బ సంపత్ కుమార్ జన్మదిన వేడుకలు రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సమక్షంలో ఘనంగా జరిగాయి.మండల పరిధిలోని రాంపూర్ గ్రామపంచాయతీలోని సంగాయపల్లి గ్రామానికి చెందిన పబ్బ సంపత్ కుమార్ జన్మదిన వేడుకలను ఆదివారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమక్షంలో కేకును కోసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకున్నారు.అనంతరం పబ్బ సంపత్ కుమార్ ను శాలువాతో సత్కరించి,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని,పేద ప్రజలకు తోచినంత సహాయాన్ని అందించాలని నిండు మనసుతో దీవించారు.ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్,వార్డు సభ్యులు కాకి రాము,జగతేయ సేటు,అడ్వకేట్ రామచందర్,మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు, యువ నాయకులు సప్పిడి పాండు,చిలుకం శేఖర్, యాదగిరి, రొయ్యల మహేష్,బోదాసు నరసింహ్మ పాల్గొన్నారు.

# నేతాజీ నగర్‌లో ఘనంగా అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం



**శేరిలింగంపల్లి, జనవరి 31 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి గుల్మోహన్ పార్క్ నేతాజీ నగర్ లో శ్రీశ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం రెండవ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ లో తెల్లవారుజామున బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ శివ నాగేంద్ర స్వామి దేవాలయంలో అర్చనలు నిర్వహించిన అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం విగ్నేశ్వర పూజలతో ప్రారంభమై హనుమాన్ విగ్రహానికి అభిషేకం నిర్వహించిన వేద బ్రాహ్మణులు హోమం నిర్వహించారు. కాలనీవాసులు పరిసర ప్రాంతాల్లో ఉన్న భక్తులు వేలాదిమంది హాజరై ప్రత్యేక పూజలు తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, ఉరిటి వెంకటరావు, రాగం మల్లికార్జున్ యాదవ్, శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, సురేందర్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆశనోళ్ళ వెంకటేష్ గౌడ్, కోశాధికారి రామేశ్వరం రెడ్డి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఏ. మల్లేష్ ముదిరాజ్, ఎం. సంతోష్ కురుమ, ఆర్ రమేష్ బాబు, సంయుక్త కార్యదర్శిలు ఎం మహేష్ కురుమ, బుచ్చన్న, ఉప్పరి దయాసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శిలు లావా చారి, యాదగిరి సాగర్, ఎం శ్రీను కురుమ, సాంబరాజు, కార్యవర్గ సభ్యులు పి. నర్సిరెడ్డి, సోమేశ్ రెడ్డి, డి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోమిన్‌పేటలో సీఎం కప్ మండల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**మోమిన్ పేట జనవరి 31( జనం సాక్షి)** మోమిన్‌పేట మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో శనివారం సిఎం కప్ మండల్ స్థాయి క్రీడా పోటీలను మండల స్పెషల్ ఆఫీసర్ సదానందం, ఎంపీడీవో సృజన సాహిత్య లు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కప్ ద్వారా గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీయడం లక్ష్యమని తెలిపారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ మండల్ స్థాయి పోటీల్లో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్ వంటి క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఎంపీఓ యాదగిరి, గ్రామ సర్పంచ్ సంధ్య సుభాష్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక మృతికి.. కారకుల అరెస్టు చేయాలి

- ట్రాక్టర్ కింద పడి మైనర్ బాలిక మృతి
- పొలం పనులకు వెళ్లిన 15 ఏళ్ల బాలిక
- 80 వేల ఇచ్చి.. శవం తీసుకెళ్లండని బెదిరింపులు..
- బాల కార్మిక చట్టం ఉల్లంఘించారని ఆరోపణ
- కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నా...అంబేద్కర్ సంఘం

**నవాబుపేట్, జనవరి 31 (జనంసాక్షి):** నవాబుపేట్ మండలం ముబారక్‌పూర్ గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదంలో మైనర్ బాలిక మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్టకూటికోసం పొలం పనులకు వెళ్లిన బాలికకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు. చైతన్య నగర్ చెందిన మాసానికిష్టప్ప కుటుంబం గత మూడు-నాలుగేళ్లుగా దయాకర్ రెడ్డి పొలంలో పనులు చేస్తోంది. రోజుకు 300 రూపాయలకే పని చేయించుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. జనవరి 28న తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో కూతురు అనూష (15) పొలం పనులకు వెళ్లింది. మార్గమధ్యలో ట్రాక్టర్ నడిపిన గోపి అజాగ్రత్తగా నడిపించడంతో ట్రాక్టర్ కింద పడి బాలిక దుర్మరణం చెందింది. సంఘటన తెలిసిన కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. దయాకర్ రెడ్డి బెదిరింపులు జరిగాయని, 'ఏమైనా చేసుకోండి' అని చెప్పారని బాధితులు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్‌పై ఇన్సూరెన్స్ ఉందని, కేసు పెట్టుకుని కోర్టు ద్వారా కొట్లాడండని చెప్పారని తెలిపారు. సర్పంచ్ సమక్షంలో కేవలం 80 వేల రూపాయలు ఇచ్చి శవం తీసుకెళ్లండని బెదిరించారని బాధితులు వాపోయారు. ఎన్నో ఏళ్లుగా దయాకర్ రెడ్డి వద్ద పనిచేస్తున్న బాధితులకు న్యాయం జరగలేదని సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. చేసేది లేక శవాన్ని తీసుకుని ఇంటికి వచ్చారు. అంబేద్కర్ ప్రజా సంఘం జిల్లా కన్వీనర్ బి.జే. వెంకటేష్, వికారాబాద్ జిల్లా దళితరత్న గ్రహీత అవార్డు బి. శివరాజ్, సలహాదారులు నింగి జాన్, బేగారీ శ్యామ్ రావు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాల కార్మిక చట్టం ప్రకారం మైనర్ బాలికతో పనులు చేయించుకోవడం నేరమని, వెనకబడిన షెడ్యూల్ కులాల చెందిన బాలిక మృతి చెందితే కేవలం 80 వేలతో చేతులు దులిపేసుకోవడం సరికాదని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని, ప్రమాద కారకులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# మామిడికుంట ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణం

**ఆలయ ధర్మకర్త డి.పురుషోత్తం రావు**



**బొంరాస్ పేట, దుద్యాల జనవరి 31 (జనం సాక్షి):** దుద్యాల మండలం చిల్ముల్ మైల్వార్, బొంరాస్ పేట మండలం లింగంపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రము మామిడికుంట ఆంజనేయ స్వామి ఆలయంలో ఇకనుండి ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త డి.పురుషోత్తం రావు తెలిపారు. శనివారం ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం యొక్క పుస్తకాలను భక్తులకు అందజేశారు.అనంతరం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నిర్మలమ్మ కరుణిస్తుందా? హైదరాబాద్‌పై వరాలు కురిపిస్తుందా?

**హైదరాబాద్, జనవరి 31 (జనంసాక్షి):**

నేడు పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ బడ్జెట్‌పై తెలంగాణ ప్రభుత్వం కోటి ఆశలు పెట్టుకుంది. భాగ్యనగరంపై కేంద్రం కరుణ చూపేనా? లేక ప్రతిసారిలాగే మొండిచేయి చూపిస్తుందా? అనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా సాగుతోంది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని భారీ ఆశలతో ఎదురుచూస్తున్నారు. కేంద్రం సహకరిస్తేనే హైదరాబాద్‌లో ప్రతిపాదిత అనేక ప్రాజెక్టులు ముందుకు సాగే అవకాశం ఉంది. లేకపోతే ఈ ప్రాజెక్టులన్నీ కేవలం కాగితాల మీదే మిగిలిపోతాయి.

రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం గమనార్హం. అంతర్జాతీయ మహానగరంగా పరుగులు పెడుతున్న హైదరాబాద్‌పై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలమ్మ కనికరిస్తేనే అభివృద్ధి పనులు వేగంగా సాగుతాయి.

**మెట్రో ఫేజ్-2కు రూ.24,269 కోట్లు**

మెట్రో రైలు రెండో దశ విస్తరణకు గత బడ్జెట్లలో ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఏడాదిన్నర క్రితం డీపీఆర్ పంపినా ఏమాత్రం స్పందన లేదు. కనీసం ఈ బడ్జెట్లోనైనా నిర్మలమ్మ కరుణిస్తే మెట్రో ఫేజ్-2 పనులు పరుగులు పెడతాయి. మెట్రో ఫేజ్-2లో నాగోల్-రాజీవ్ గాంధీ ఇంటర్నేష నల్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గం-కోకాపేట నియోపాలిస్, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీ. మార్గంలో నిర్మాణం చేపట్టనున్నారు. దీనికి రూ.24,269 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా 50:50 వాటాతో నిధులు కేటాయించాలని కోరింది.

**మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ.14,100 కోట్లు**

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.14,100 కోట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు ఈ నిధులు కావాలి.

**ట్రిపుల్ ఆర్‌కు రూ.34,367 కోట్లు**

రీజనల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్)కు రూ.34,367.62 కోట్లు అవసరమని తెలిపింది. 2016లోనే కేంద్రం దీనికి ప్రాథమిక అనుమతి ఇచ్చినా నిధుల మంజూరు జరగలేదు. ఔటర్ రింగ్ రోడ్ నుంచి రీజనల్ రోడ్ మధ్య నిర్మించే 10 గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్లకు రూ.4 వేల కోట్లు కావాలని కోరింది. భూసేకరణ వ్యయంలో కేంద్రం భారం పంచుకోవాలని డిమాండ్ చేస్తోంది.

**గోదావరి నీటి తరలింపు.. రూ.7,440 కోట్లు**

గోదావరి నుంచి హైదరాబాద్‌కు 20 టీఎంసీల నీటిని తరలించేందుకు రూ.7,440 కోట్లు అవుతాయి. ఈ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయిస్తేనే మూసీని సుందర పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దగలమని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

**మధ్య తరగతి ఆశలు**

మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలు ఆదాయపు పన్ను పరిమితి పెంచాలని ఆశతో ఎదురుచూస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ ఎంపీలు ఉన్నారు. ఈ ఏడాది జీహెచ్ఎంసీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీజేపీకి ఇది కీలక అవకాశం. ఇప్పుడైనా హైదరాబాద్‌కు నిధులు ఇస్తే ఇక్కడ మనుగడ ఉంటుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ రవాణా వ్యవస్థకు, మూసీ సుందరీకరణకు ప్రత్యేక ప్యాకేజీ ఆశిస్తోంది. గత బడ్జెట్లలో హైదరాబాద్‌కు ఒక్క పైసా కూడా కేటాయించకుండా పోయిన కేంద్రం ఈసారి కరుణ చూపిస్తుందా? అనేది నేటి బడ్జెట్‌లోనే తేలనుంది.

## మట్టి రోడ్డు పనులకు నిధులు మంజూరు



**కేశంపేట, జనవరి 31 (జనంసాక్షి) :** మండల పరిధిలోని బోధునం పల్లి గ్రామం నుండి రామకృష్ణాపురం గ్రామ బీటీ రోడ్డు వరకు ఆయా గ్రామాల రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను బోదునం పల్లి సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మట్టి రోడ్డు నిర్మాణం కోసం 5 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోరి జగదీశ్వర్, సీనియర్ నాయకులు తాండ్ర కాశీనాథ్ రెడ్డి, బోనం రామచంద్ర రెడ్డి, బోనం చంద్ర శేఖర్ రెడ్డి, వెంకటాపురం నర్సింహా పాల్గొన్నారు.

## నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలన

### జాగ్రత్తగా పరిశీలించాలి

**ఎన్నికల అబ్జర్వర్ జి.రవి**




**తాండూరు జనవరి 31(జనంసాక్షి):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్బంగా నామినేషన్ ల సూక్ష్మ పరిశీలన జాగ్రత్తగా పరిశీలించాలని ఎన్నికల అబ్జర్వర్ జి.రవి ఐఎఎస్ అధికారులకు ఆదేశించారు.శనివారం తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ ల సూక్ష్మ పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈసందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ నామినేషన్ లను ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా పూర్తి స్థాయిలో పరిశీలించాలని, ఎన్నికలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల పత్రాలు ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా జాగ్రత్తగా నిబంధన బద్దంగా పరిశీలిం చాలని అన్నారు .వార్డు వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఏవైనా వార్డులు ఏకగ్రీవం అయ్యాయా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్,ఆర్ ఓ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ ప్రవీణ్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి.**

**తాండూరు జనవరి 31(జనంసాక్షి): పట్టణవాసి** పటేల్ ప్రవీణ్ కు మెరుగైన వైద్య సేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ పటేల్‌ను పైలెట్ రోహిత్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ అవసరమైన మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆస్పత్రి వైద్యులను కోరారు. అలాగే అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని డెక్కన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాండూరు పట్టణానికి చెందిన బీజేపీ యువ నాయకుడు జగదీష్‌ను కూడా పరామర్శించారు.



## సిరిపురం గ్రామంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము



**మర్పల్లి జనవరి 31 (జనంసాక్షి):** శనివారం మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో వీరశైవ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం, శ్రీ మంగళ శక్తి పీఠం ఆధ్వర్యంలో పరమేశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకము, శివపార్వతుల కళ్యాణం జంగమ అర్చక పురోహితులు నిర్వహించడం జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజ కారక్రమాలు చేశారు. ఈ కార్యక్రమం శ్రీ అష్ట తీర్థ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం అధ్యక్షులు మఠం వీరేశం స్వామి, సిరిపురం మాఠాధితులు మఠంకాశీనాథ్ స్వామి, మరియు అశోక్ స్వామి, చంద్రశేఖర్ స్వామి, సంగయ్య స్వామి, వివిధ అర్చక పురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

**బిఆర్ఎస్ పార్టీ యాచారం మండల నాయకులు మూడేడ్ల గోవర్ధన్ రెడ్డి**



**యాచారం, జనవరి 31(జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని బిఆర్ఎస్ పార్టీ యాచారం మండల నాయకులు మూడేడ్ల గోవర్ధన్ రెడ్డి అన్నారు. పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలి టీలకు, 7 నగరపాలక సంస్థలకు ఫిబ్రవరి 11 న ఎన్నికలు జరుగుతున్నా నేపథ్య ంలో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన ఘనత బీఆర్ఎస్ పార్టీది అని పేర్కొన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు ఎదురు చూస్తున్నారని తెలిపారు.

## జగదీశ్ కు మేరుగైన వైద్యసేవలు అందించాలి

### ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీరాష్ట్ర కార్యవర్గసభ్యులు యు రమేశ్ కుమార్



**తాండూరు (జనంసాక్షి):** జగదీశ్‌కు మేరుగైన వైద్యసేవలు అంది ంచాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ డెక్కన్ హాసుపత్రిలో శుక్రవారం రాత్రి అకాస్మాతుగా అనారోగ్యానికి గురై చికిత్సపొం దుతున్న సాయిపూర్ జగదీశ్ ను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరియు బీజేపీరాష్ట్ర కార్యవర్గసభ్యులు యురమేశ్ కుమార్‌తో కలిసి పరామర్శించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో జగదీశ్ ఆనా రోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. జగదిష్ త్వరగా కోలు కోవాలని అకాక్షించారు.

## ఒగ్గు కళాకారులకు స్వగ్రామంలో ఆత్మీయ సన్మానం



**బొంరాస్ పేట, (జనంసాక్షి):** మండల పరిధిలోని నాందార్ పూర్ గ్రామానికి చెందిన సందం చిట్టెమ్మ,రాములు కుమారులు జాతీయ ఒగ్గు కళాకారులు సందం బీరప్ప,శివకుమార్ జనవరి 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి ప్రధానమంత్రి సమక్షంలో అద్భుతమైన ఒగ్గుడోలు ప్రదర్శన నిర్వహించి తిరిగి స్వగ్రామానికి రావడం జరిగింది.శనివారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ,పంచాయతీ కార్యదర్శి శోభారాణి ఒగ్గు కళాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.గ్రామానికి చెందిన యువకులు జాతీయస్థాయిలో ఒగ్గుడోలు ప్రదర్శన నిర్వహించడం గ్రామానికి ఎంతో గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాఘవేందర్, గ్రామస్తులు మల్లయ్య, సాయప్ప,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**ఆనేగొని శ్రీకాంత్ గౌడ్**



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారో గ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనేగొని శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం తిరుమలలో వైకుంఠ ద్వారం ద్వారా శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆయన బంధువులు స్నేహితులతో కలి సి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసం తోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యంగా శంషాబాద్ మండల ప్రజల శ్రేయస్సు కోసం స్వామివారిని వేడుకున్నానని అన్నారు. తనతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి స్వామివారి దర్శనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాకారం గ్రామ సర్పంచ్ ఏ.వెంకటేష్ గౌడ్, జి.శ్రీశైలంగౌడ్, , కె. వెంకటేష్ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి : సీపీఐ



**రాజేంద్రనగర్, (జనంసాక్షి):** ఫిబ్రవరి 12న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్లను శంషాబాద్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు పాలమకుల జంగయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకై సార్వత్రిక సమ్మె అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు కే.చందు యాదవ్, ఎస్.మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్, సీపీఐ మండల కార్యదర్శి నర్రగిరి కే. రాజు, స్వామి, కొండల్, జెట్టి శ్రీనివాస్, నారాయణ, ఏఐటీయూసీ జిల్లా సంఘ సభ్యులు ప్రవీణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కప్పు మండల స్థాయి క్రీడా పోటీలు

**కోట్ పల్లి జనవరి 31 (జనంసాక్షి):** కోట్ పల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సీఎం కప్పు మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. విజయవంతంగా ముగిసయి ప్రథమ స్థానం కోట్ పల్లి గ్రామపంచాయతీ వాలీబాల్ టీం, రెండవ స్థానం నాసన్పల్లి గ్రామపంచాయతీ టీం, కబడ్డీ పోటీలో ప్రథమ స్థానం కబడ్డీ కొత్తపల్లి టీం, రెండవ స్థానం కంకణాలపల్లి , ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానం కోట్ పల్లి, రెండవ స్థానం కంకలపల్లి ఈ పోటీలో వివిధ గ్రామాల క్రీడాకారులను ఉత్వంగా పాల్గొని పద్యము కనబరి చారు విజేతలైన జట్టను అభినందించారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమంత్, ఎంఈఓ చంద్రప్ప, ఎమ్మార్వో శ్రీనివాస్, ఎంపీ ఓ సురేందర్ రెడ్డి, ఎస్ఐ శైలజ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, పాల్గొన్నారు.



# గ్రామీణ క్రీడ ప్రతిభను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యం



**మర్పల్లి జనవరి 31(జనంసాక్షి)** గ్రామీణ యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలు మండల కేంద్రంలో శనివారం ప్రారంభ మయ్యాయి. మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం కార్యాలయ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి క్రీడలను ఇంఛార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, మర్పల్లి సర్పంచ్ రామేశ్వర్ కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంఛార్జి ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ రామేశ్వర్ మాట్లాడుతూ, సీఎం కప్ క్రీడల ద్వారా గ్రామీణ ప్రాంతాల యువతకు నూతన ఉత్సాహం కలుగుతోందన్నారు. క్రీడలు కేవలం వినోదానికే కాకుండా యువతను క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, పోటీ భావన వైపు నడిపిస్తాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదగడానికి సీఎం కప్ దోహదపడుతుందని తెలిపారు. , మండల స్థాయిలో క్రీడల నిర్వహణతో యువతలో క్రీడల పట్ల ఆసక్తి మరింత పెరుగుతోందన్నారు. సీఎం కప్ గ్రామీణ క్రీడాకారులకు పెద్ద వేదికగా మారిందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. క్రీడల ప్రారంభ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్,ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భగవద్గీత పారాయణ పోటీలు



**పరిగి జనవరి 31 జనం సాక్షి :** పరిగి నియోజకవర్గం దోమ మండల పరిధిలోని మోత్కూరు గ్రామంలో భగవద్గీత పారాయణ వార్షికోత్సవ సందర్భంగా భగవద్గీత పోటీ నిర్వహించడం జరిగింది ఈ పోటీలు భవదీత జ్ఞాపకుడు రాముడు మరియు న్యాయ నిర్ణీత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఇట్టి పోటీలో మొత్తం 30 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ బహుమతిగా వడ్డే మణికంఠ ద్వితీయ బహుమతి ఉప్పరి అభిరాం తృతీయ బహుమతి ఇమ్మడి విలాస్ నాలుగో బహుమతి ఇమ్మడి వివాన్ గెలుచుకున్నారు వీరికి గ్రామ పెద్దలు బహుమతి ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపేట ఆనంద్ కుమార్ దేవాలయ కమిటీ చైర్మన్ మరియు కె ఎస్ ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ గ్రామ మాజీ సర్పంచ్ కేశవులు ఉపసర్ప శ్రీకాంత్ రావు ఉద్యోగ సంఘ నాయకులు రామకృష్ణ దనేశ్వర్ దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ నర్సింలు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు వెంకటయ్య జ్ఞాన సరస్వతి విద్యాలయ ఉపాధ్యాయుడు నర్సింలు ఆర్ఎస్ఎస్ సంఘ కార్యకర్తలు శివకుమార్ పుల్ల సురేష్ కుమార్ వడ్డే శివకుమార్ గడ్డల కృష్ణ మంగళ శ్రీకాంత్ గ్రామ పెద్దలు యువకులు శివ భక్తులు పాల్గొన్నారు

# సూక్ష్మంగా నామినేషన్ పత్రాలను పరిశీలించాలి : ఎన్నికల పరిశీలకులు రవి



**కొడంగల్ ,జనవరి 31 (జనంసాక్షి) :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా నామినేషన్‌ల సూక్ష్మ పరిశీలన జాగ్రత్తగా పరిశీలించాలని ఎన్నికల అబ్జర్వర్ రవి అధికారులకు ఆదేశించారు. శనివారం కొడంగల్ మున్సిపల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన నామినేషన్ ల సూక్ష్మ పరిశీలన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ నామినేషన్ లను ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా పూర్తి స్థాయి లో పరిశీలించాలని, ఎన్నికలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల పత్రాలు ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా డాక్యుమెంట్లు ఉన్నాయా లేదా జాగ్రత్తగా నిబంధన బద్దంగా పరిశీలించాలని అన్నారు. వార్డు వారీగా గా ఎన్ని దరఖాస్తు లు వచ్చాయి, ఏవైనా వార్డులు ఏకగ్రీవం అయ్యాయా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఆర్ఓ లు పాల్గొన్నారు.

# చెరువు పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం ప్రజలందరి బాధ్యత

## అత్తాపూర్ ఉప కమిషనర్ సమయ్య



**రాజేంద్రనగర్, జనవరి31(జనంసాక్షి) :** చెరువులు, చెరువుల పరిసర ప్రాంతాలలో చెత్తాచెదారం వేయకుండా, స్వచ్ఛత పరిశుభ్రత వహించడం ప్రజలందరి బాధ్యత అని అత్తాపూర్ ఉప కమిషనర్ సమయ్య పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత ఆదేశాల మేరకు శనివారం చెరువులు, చెరువుల పరిసర ప్రాంతాలలో విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా అత్తాపూర్ సర్కిల్ నం.20 పరిధిలో ఉన్న 13 చెరువులు, వాటి చుట్టూ ఉన్న ప్రాంతాలను పూర్తిగా శుభ్రపరిచారు. శనివారం హైదర్‌గూడ పెద్ద తాళ్లకుంట చెరువు పార్కును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పాదచారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. చెత్తాచెదారం లేకుండా పార్కును శుభ్రంగా అభివృద్ధి చేసినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జీహెచ్ఎంసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**కరీంనగర్/హుజురాబాద్, జనవరి 30 (జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ అలంను తురుకోడా అని దూషించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తూ నగరంలోని హౌసింగ్ బోర్డ్ చౌరస్తా లో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ఎంఐఎం పార్టీ కార్యకర్తలు నాయకులు శుక్రవారం రాత్రి దగ్ధం చేశారు. కౌశిక్ రెడ్డి డౌన్ డౌన్ ఖబర్దార్ కౌశిక్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తిరగనివ్వమని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఒకవైపు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గంగా జమున తెహజీబ్ను కాపాడాలని చెబుతుంటే మరోవైపు కౌశిక్ రెడ్డి కేసిఆర్ ఆశయాలను తుంగలో తొక్కి, ముస్లింలను తురుకోడా అని సంబోధించడం రాజకీయ అవివేకానికి నిదర్శనమని అభివర్ణించారు. ఐదేళ్ల ఎమ్మెల్యేగా ఉండిపోయే కౌశిక్ రెడ్డి, 40 సంవత్సరాలు దేశం కోసం సేవ చేసే ఐపీఎస్ ను అసభ్య పదాజాలంతో దూషించడం సరికాదన్నారు. కౌశిక్ రెడ్డికి రాజకీయ పరిపక్వత లేదని కేవలం నోటి దురుసుతో రాజకీయ జీవితం తనంతట తానే నాశనం చేసుకుంటూ బిఆర్ఎస్ పార్టీని ముస్లిం సమాజంలో అభాసపాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ లు స్పందించి కౌశిక్ రెడ్డి పై పార్టీ పరమైన చర్యలను తీసుకోవాలని, క్షమాపణ చెప్పించాలని భవిష్యత్తులో కౌశిక్ రెడ్డి ఏ కులాన్ని, మతాన్ని కించపరచకుండా నోటిని అదుపులో ఉండేట్లు జాగ్రత్తలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమాజానికి, సిపి గౌస్ ఆలం కు, కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పకుంటే కరీంనగర్లో కౌశిక్ రెడ్డి ఎక్కడ అడుగుపెట్టిన తన్ని తరుముతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, ఎండి రఫీ, ఖాజా మొయినుద్దీన్, , ఖమరొద్దీన్ షబ్బీర్, ఎండి రఫీ, నిజం, ఆయుబ్ అలీ, మిస్కిన్, ఇలియాజ్, ఇర్ఫాన్, సయ్యద్, ఖాజా, అల్తాఫ్, ముజ్జు, జబ్బార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై హుజురాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మైనారిటీ నాయకులు

# విద్యతో పాటు విలువలను పెంపొందించుకోవాలి

**విద్యార్థి దశలో ఇంటర్ విద్య ముఖ్యం : ఎంజీయూ టీపీడీఎంఏ అధ్యక్షులు తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి**



**సూర్యాపేట (జనంసాక్షి):** విద్యార్థులు విద్యలో రాణించడంతోపాటు విలువలను పెంపొందించుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల యాజమాన్యం సంఘం అధ్యక్షులు తీకుళ్ల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాయిగౌతమి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సాయి గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని నైపుణ్యాలను, విలువలను నేర్పిస్తున్నట్లు తెలిపారు. కార్పొరేట్ కళాశాలకు ధీటుగా ఇంటర్ విద్యలో సాయి గౌతమి కళాశాల ముందంజలో ఉందని అన్నారు. పేద విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వడంతో పాటు ఉన్నతంగా రాణిస్తున్న విద్యార్థులకు చేయూతను అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులకు నేర్చుకోవాలనే తపన ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో టాప్ కాలేజీ అయినా స్పందన డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు ప్లేస్మెంట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు గ్రూప్ వన్ ఆఫీసర్,ఆ కళాశాల పూర్వ విద్యార్థి నరేష్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యరగాని లక్ష్మయ్య గౌడ్, కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ తీకుళ్ల సోమిరెడ్డి, శేరి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సకల ప్రాణులకు నీరే ప్రాణాధారం

## వెల్చల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్



**మోమిన్‌పేట జనవరి 31 (జనంసాక్షి) :** ప్రపంచంలో సకల ప్రాణులకు నీరే జీవనాధారం, విద్యార్థులకోసం వాటర్ ప్యూరిఫైయర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని, వెల్చల్ గ్రామ సర్పంచ్ కావలి శ్రీనివాస్ అన్నారు. శనివారం మోమిన్ పేట మండల పరిధిలోని వెల్చల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐలెన్స్ టెక్నీషియన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కుమార్ పాఠశాల విద్యార్థుల కోసం వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తుల అందరి తరపున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఐ లెన్స్ టెక్నాలజీస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కుమార్, పప్పు స్వామి, సి ఎస్ ఆర్ టీం లీడర్ రాందాస్ పల్లి మనోహర్, పాఠశాల పూర్వ విద్యార్థులు, మురళి ఐ లెన్స్ వాలంటీర్స్ వారు విద్యార్థులకు తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు, వాటర్ ప్యూరిఫైయర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం నిజంగా సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం టీం వాలంటీర్స్ ను,శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉప సర్పంచ్ రాజల రమేష్, మధుసూదన్ రెడ్డి, సంజీవరెడ్డి, దామోదర్ సాగర్, కంఠం ప్రభు సాగర్, సుధాకర్ రెడ్డి, విజేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.





# పట్టుదలతో చదివితే లక్ష్య సాధన సులభం

## ఐఏఎస్ అన్వేష రెడ్డి

**రాజేంద్రనగర్,జనవరి30(జనంసాక్షి) :** పట్టుదలతో చదివితే లక్ష్య సాధన కష్టమేమీ కాదని ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల డైరెక్టర్ జనరల్ ఐఏఎస్ పి . అన్వేషరెడ్డి అన్నారు. 9వ, 10వ తరగతుల నుంచే విద్యార్థులు దిశానిర్దేశం చేసుకోవాలని సూచించారు. రాజేంద్రనగర్ గవర్నమెంట్ హైస్కూల్ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ డా. ఎం. సుగుణ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 36 ఏళ్ల సేవలో పాఠశాలనే ఇల్లుగా భావించి వెయ్యికి పైగా విద్యార్థులను సొంత పిల్లలుగా చూసుకున్నారని తెలిపారు. అంకితభావం, క్రమశిక్షణతో ఏ రంగంలోనైనా విజయం సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. డా. సుగుణ పదవీ విరమణ పాఠశాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎవిఎన్. రెడ్డి డా. సుగుణ సేవలను ప్రశంసిస్తూ, పాఠశాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తానని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి పి. సుశీంద్రరావు మాట్లాడుతూ డా. సుగుణ జిల్లాలోని ఉపాధ్యాయులకు ఆదర్శనీయమని, ఆమె అంకితభావానికి ఇది గుర్తింపేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్, సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భక్తులతో కిటకిటలాడిన శనైశ్వర స్వామి దేవాలయం

**మోమిన్‌పేట జనవరి 31 (జనం సాక్షి) :** మోమిన్ పేట మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో వెలసిన శ్రీ శనైశ్వర స్వామి దేవాలయంలో, శనివారము,శని త్రయోదశి కలిసి రావడంతో, వివిధ ప్రాంతాల నుండి భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో విచ్చేసి శనైశ్వర స్వామికి ప్రత్యేక పూజలు తైలాభిషేకాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు తాగునీటి సౌకర్యము గడ్డం రాజేశ్వర్ కే యాదగిరి మానెమ్మ దంపతుల పేరుతో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయనైనదని ఆలయ కార్య నిర్వహణ అధికారి నరేందర్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ సిబ్బంది జగన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు



**దోమ జనవరి 31 జనం సాక్షి :** మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన సిద్ది రాములు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈయనకు 19,000 వేల రూపాయలు సీఎం సహాయనిధి నుంచి ,పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ఆదేశానుసారం ఎం ఎల్ సి నవీన్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కును మాజీ వైస్ ఎంపీపీ గురుమిట్కల మల్లేశం ఈ రోజు రాములుకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లేశం, మాజి ఉప సర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు, సుధాకర్ రెడ్డి, గుణి గారి అంజయ్య, , బైండ్ల రమేష్ ,బంక చెన్నయ్య వెంకటయ్య, పెంటయ్య , లక్ష్మయ్య, రాములు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మల దహన కార్యక్రమం



**దోమ, జనవరి 31 జనంసాక్షి :** కేసీఆర్‌ను సిట్ విచారణకు పిలవడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు గులాబీ పార్టీ అధిష్టానం పిలుపు ఇచ్చింది. ఈ మేరకు పరిగి మాజీ కొప్పుల మహేష్ రెడ్డి ఆదేశానుసరం శాంతియుతంగా ఎక్కడికక్కడ మండల, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేసీఆర్ పై రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నల్ల జెండాలతో నిరసనలు,ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాలని పిలుపునిచ్చరు. మండలంలోనీ మీ మీ గ్రామాల్లోనే పార్టీ నాయకులు ఆయా గ్రామాల్లోనే ప్రభుత్వ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులంతా సమన్వయంతో పనిచేయాలి

## గ్రామాలలో పటిష్ఠమైన కమిటీలు వేయాలి

## మాజీ జెడ్పి చైర్‌పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి



**మహేశ్వరం,జనవరి31(జనంసాక్షి) :** రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేయాలని రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండలం గట్టుపల్లిలోని కెసిఆర్ రిసార్ట్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీగల అనిత హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ... మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామంలో పటిష్టమైన కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో గెలిచినవారు, ఓడినవారు అని తేడా లేకుండా అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులు, క్రీడాకారులలో ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ ఆటల పోటీలు

## వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి



**బొంరాస్‌పేట, జనవరి 31 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు,క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సీఎం రేవంత్ రెడ్డి “సీఎం కప్ “ఆటల పోటీలను ప్రవేశపెట్టారని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఎంపీడీవో వెంకన్ గౌడ్,ఎంఈవో హరిలాల్ తో కలిసి సీఎం కప్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరేశలింగం, జయకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సీఎం కప్ విజేతలు వీళ్లే..

వాలీబాల్ అండర్- 18 బాలుర విభాగంలో మొదటి బహుమతి సీత్యానాయక్ తండ,ద్వితీయ బహుమతి నాందార్ పూర్, బాలికల విభాగంలో మొదటి బహుమతి జడ్పీహెచ్ఎస్ చౌదర్పల్లి,ద్వితీయ బహుమతి ఎంజెపిటి బురాన్ పూర్,ఖోఖో బాలుర విభాగంలో మొదటి బహుమతి జడ్పిహెచ్ఎస్ బొంరాస్ పేట,ద్వితీయ బహుమతి జెడ్పిహెచ్ఎస్ రేగడిమైలారం,వాలీబాల్ అండర్- 14 బాలుర విభాగంలో మొదటి బహుమతి జడ్పిహెచ్ఎస్ బొంరా స్ పేట,ద్వితీయ బహుమతి జడ్పిహెచ్ఎస్ చౌదర్పల్లి జట్లు గెలుపొందాయి.



జనంసాక్షి

## ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయి :సీఐ వెంకటేశం



**కుత్బుల్లాపూర్ జనవరి 31 (జనం సాక్షి) :** ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజల కు ఎంతో ఉపయోగపడతాయని జగద్గిరిగుట్ట సిఐ వెంకటేశం అన్నారు. శనివారం గాజులరామారం డివిజన్, ప్రకాశంపంతులు నగర్ లోని ఏఎంఎస్ పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ సయ్యద్ ఇమ్రాన్ పుట్టినరోజు పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో మల్లారెడ్డి ఆసుపత్రి(సూరారం)బాబాజీ (నేత్రాలయం) కంటి ఆసుపత్రి (కూకట్పల్లి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పాఠశాల చైర్మన్ సయ్యద్ రషీద్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదినోత్సవం సందర్భంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహి ంచడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. పేద ప్రజలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ ఇమ్రాన్ మాట్లాడుతూ తన పుట్టినరోజున పేద ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.అనంతరం వివిధ విభాగాల వైద్య నిపుణులచే సాధారణ,బిపి,షుగర్ ఆర్థోపెటిక్, దంత, కంటి, సుమారు 300 మందికి పైగా విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వైద్యపరీక్షలు చేయించుకున్నారు..వారికి సీఐ.చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి కృష్ణాగౌడ్, తంగ లక్ష్మారెడ్డి, ఎండి.మోయిజ్ కూకట్పల్లి ఐవైసీ అధ్యక్షులు సలీమ్,మేడ్చల్ జిల్లా కెమిస్ట్ సంఘం అధ్యక్షులు వేణుగోపాల్ శర్మ, ప్రధాన కార్యదర్శి తిరుమల రెడ్డి,కోశాధికారి నాగరాజు, కుత్బుల్లాపూర్ మండల కెమిస్ట్ సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి,బి ఆర్ఎస్ నాయకులు సయ్యద్ సాజిద్,తోపాటు పలు పాఠశాలల కరస్పాండెంట్లు, శ్రేయోభిలాషులు, విద్యార్థుల తల్లిదండ్రు లు పాల్గొని కరస్పాండెంట్ సయ్యద్ ఇమ్రాన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# క్రీడలలో యువత రాణించాలి

- క్రీడలకు ముఖ్యమంత్రి ప్రోత్సాహం
- ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి
- యాచారంలో అట్టహాసంగా ముగిసిన మండల స్థాయి సీఎం కప్ 2026 క్రీడా పోటీలు




యాచారం జనవరి 31(జనం సాక్షి) యువత క్రీడల్లో రాణించాలని రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. శనివారం నాడు యాచారంలో ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యువత, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి ఉపయోగపడతా యన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తార న్నారు. ఇటీవలే అంతర్జాతీయ ఆటగాడు మెస్సితో కలిసి ఫుట్బాల్ ఆడిన సందర్భాన్ని గుర్తు చేశారు. మండలంలోని పది క్లస్టర్ల నుండి ఎంపికైన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో మరియు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి అసెంబ్లీ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు యాచారం మండల సీఎం కప్ ఇంచార్జ్ మల్లేష్ తెలిపారు.

**విజేతల వివరాలు:**

వాలీబాల్ (బాలురు): ప్రథమ బహుమతి నందివనపర్తి, ద్వితీయ బహుమతి - యాచారం. కబడ్డీ :(బాలికలు): ప్రథమ బహుమతి - యాచారం, ద్వితీయ బహుమతి - పుడమి. బాలుర విభాగంలో ప్రథమ బహుమతి చింతపట్ల, ద్వితీయ బహుమతి చౌదరిపల్లి. ఖో-ఖో (బాలురు): ప్రథమ బహుమతి - చింతపట్ల , ద్వితీయ బహుమతి - తమ్మాలోనిగూడ, బాలికల విభాగం లో ప్రథమ బహుమతి చింతపట్ల, ద్వితీయ బహుమతి తమ్మాలోనిగూడ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో, స్పెషల్ ఆఫీసర్ మాధవ రావు, ఎంఆర్వో అయ్యప్ప , మండల విద్యాధికారి పాండురంగా రెడ్డి, ఎంపీడీవో సూపరింటెండెంట్ శైలజ, సబ్ ఇన్స్పెక్టర్ ప్రియాంక, యాచారం గ్రామ సర్పంచ్ మస్కు అనిత, బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు పాల్గొని అభినందించారు. మండలంలోని అన్ని పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, మల్లేష్, యాదమ్మ, కృష్ణ, భాస్కర్,ఆంజనేయులు, ప్రశాంతి మరియు క్రీడాభిమానులు గ్రామ యువకులు వంశీ, రమేష్ పాఠశాలఉపాధ్యాయులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

## సమాజంలో పోలీసు అధికారి పాత్ర నిరుపమానం : సిపి డాక్టర్ రమేష్



**శేరిలింగంపల్లి, జనవరి 31 (జనంసాక్షి) :** సమాజంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగిపాత్ర అనన్య సామాన్యమని, కుటుంబవ్యవస్థ, తన వ్యక్తిగత జీవితం నాణానికి ఒకవైపు అయితే ఉద్యోగ విధి నిర్వహణకూడా అదే నాణానికి మరోవైపుగా అభివర్ణించవచ్చని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు పలువురు సైబరాబాద్ పోలీస్ అధికారుల పదవీ విరమణ కార్యక్రమాన్ని శనివారం సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఘనంగా ఏర్పాటు చేయగా దానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి, అందులోనూ పోలీసు ఉద్యోగి విధి నిర్వహణ నిరంతరం కత్తిమీద స్వాముల కొనసాగుతూ తన కుటుంబ వ్యవస్థ, వ్యక్తిగత జీవితాన్ని ఒక కోణంలో చూడగలిగితే అంతే స్థాయిలో విధి నిర్వహణ బాధ్యతకూడా స్పష్టంగా కనిపిస్తుంద న్నారు. సామాజిక స్థితిగతులు, శాంతి భద్రతల పరిరక్షణకై నిరంతరం అప్రమత్తతతో వ్యవహరిస్తూ ఎన్నో సందర్భాలలో అనేక కీలక వ్యక్తిగత ప్రాతినిధ్యాలను సైతం పక్కనపెట్టి ఉద్యోగం ముందు, కుటుంబ బాధ్యతలు నెక్స్ట్ అన్న విద్యుక్త ధర్మాన్ని భుజాన వేసుకుని అలుపెరుగని పోరాటం చేస్తూ చరమాంకంలో తిరిగి చూసుకుంటే విధినిర్వహణ తీపిచేదు జ్ఞాపకాలు తప్ప వ్యక్తిగత జీవితంలో తనకంటూ ఏమి మిగిల్చుకోలేని కర్మయోగి ఉద్యోగి అని సిపి వివరించారు. కాగా పదవీ విరమణ పొందిన వారిలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విఠల్ జాదవ్, కెపిహెచ్బి ఎస్ఐ సయ్యద్ నజీర్, చందానగర్ స్టేషన్ ఎస్ఐ ఎన్. కృష్ణయ్య, మహిళా దేవరపల్లి పిఎస్ ఏఎస్ఐ మహమ్మద్ ఆయుబ్ ఉన్నారు. వీరికి సైబరాబాద్ సిపి రమేష్‌తో పాటు అడ్మిన్ విభాగం డిసిపి టి. అన్నపూర్ణ పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులంతా తమ శేష జీవితాన్ని కుటుంబంతో గడపాలని, సమాజ హితం కోసం తమ వంతు సహాయ సహకారాలను అందిస్తూ జూనియర్ పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ ముందుకు సాగాలని పోలీసు అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందిన అధికారులకు ప్రత్యేక సత్కారంతోపాటు పెన్షన్ పత్రాలు, ఇతరత్రా ప్రభుత్వ సదుపాయాలకు సంబంధించిన ధ్రుపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్ హెడ్ క్వార్టర్స్ డిసిపి సంజీవ్, ఏడిసిపి సమీర్, ఏవో అడ్మిన్ జ్యోతి మణి, ఎకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమాకర్, సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్చార్జి మల్లేశం పాల్గొన్నారు.

## రాజకీయ కక్ష్య సాధింపుతోనే కేసీఆర్‌కు నోటీసులు

### కెసిఆర్ జోలికి వస్తే కాంగ్రెస్ కు పతనం తప్పదు

**తలకొండపల్లి మాజీ ఎంపీపీ,బారాస సీనియర్ నాయకులు సీఎల్ శ్రీనివాస్ యాదవ్**



**తలకొండపల్లి జనవరి 31(జనం సాక్షి):** మున్సిపల్ ఎన్నికల వేళ ప్రజా సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్ కి సిట్ నోటీసులు జారీ చేశారని తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు.బీఆర్ఎస్ అధినేత,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు,కు మరోసారి నోటీసులు జారీ చేయడంపై సీఎల్ శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా స్పందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ కక్ష్య సాధింపులో భాగంగానే సిట్ పేరుతో కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ప్రభు త్వం వరుసగా నోటీసులు జారీ చేస్తోందని ఆరోపించారు.కేసీఆర్ విచారణకు సహకరించ బోనని ఎక్కడా చెప్పలేదని,కేసీఆర్ చట్టాన్ని గౌరవించే నాయకుడని,విచారణకు పూర్తిగా సహకరిస్తానని చెప్పారని,తాను నివాసం ఉంటున్న ఎర్రవల్లి లో విచారణ జరపాలని కోరారని,అయితే ఏకపక్షంగాతిరస్కరించారని విమర్శించారు.కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని,ఇలాంటి చర్యలతో బీఆర్ఎస్ పార్టీని గానీ,కేసీఆర్ ను గానీ బలహీనపర్చలేరని ధీమా వ్యక్తం చేశారు.మున్సిపాలిటీ,కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకు ఇలాంటి వ్యవహారాలు చేస్తున్నారని దీనికి నిరసనగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలతోపాటు గ్రామాలలో బీఆర్ఎస్ శ్రేణులు శాంతియుతంగా బైక్ ర్యాలీలు,నల్లజెండాలతో నిరసనలు, ధర్నాలు, రాస్తరోకోల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

## యెన్కెపల్లి గ్రామంలో 21 సీసీ కెమెరాల ఏర్పాటు



**మొయినాబాద్: జనవరి 31(జనం సాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని యెన్కెపల్లి గ్రామంలో గ్రామ శాంతి భద్రతల పరిరక్షణ దిశగా కీలక ముందడుగు పడింది. గ్రామానికి చెందిన కే. కిషోర్ కుమార్ సహకారంతో గ్రామంలోని ముఖ్య ప్రాంతాల్లో మొత్తం 21 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం గ్రామస్తుల నుంచి ప్రశంసలు పొందుతోంది. ఈ సందర్భంగా మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక సాంకేతికత వినియోగంతో నేరాలను నియంత్రించవచ్చని అన్నారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు తగ్గడమే కాకుండా, ఏదైనా సంఘటన జరిగితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ప్రజలు మరింత భద్రతా భావంతో జీవించగలుగుతారని తెలిపారు.

గ్రామ భద్రత కోసం ముందుకు వచ్చిన కే. కిషోర్ కుమార్ సీఐ పవన్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కే. కిషోర్ కుమార్ మాట్లాడుతూ....నేను నివసిస్తున్న గ్రామం కావడం వల్ల గ్రామాభివృద్ధి, శాంతి భద్రతల కోసం నా వంతు సహకారం అందించడం నా బాధ్యత. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే ఇలాంటి చిన్నపాటి సహాయాలు చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను" అని తెలిపారు. గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమాన్ని సెక్టార్ ఎస్సై నరసింహారావు, విపిఓ టి, రాముచందర్ గౌడ్ ,స్వాగతిస్తూ, సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామంలో నేరాలు తగ్గి శాంతియుత వాతావరణం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలవాలని పలువురు అభిప్రాయపడ్డారు.

## తాండూరులో... ఎంపీ అసదుద్దీన్ పాదయాత్ర

**ఎఐఎంఐఎం పార్టీ నేతలతో ఆప్యాయత.... పలకరింపు.**



**తాండూరు జనవరి 31(జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎఐఎంఐఎం జిల్లా అద్యక్షులు మరియు పట్టణ అద్యక్షులు హదీ షహరీ ఆద్వర్యంలో ఎఐఎంఐఎం పార్టీ అద్యక్షులు ఎంపి అసదుద్దీన్ ఓవైసి పట్టణంలోని 14, 15, 16, 17, 18, 19, 20, 21, 22 వార్డలలో పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐఎంఐఎం పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను పలకరించారు. వార్డు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు..ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ అభ్యర్థులకు మద్దతుగా మాట్లాడుతూ తాండూర్ మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పట్టణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐఎంఐఎం కార్యాలయాన్ని జిల్లా, తాండూర్ పట్టణ అధ్యక్షులు హదీ షహరీ తో కలిసి ప్రారంభించారు. ఈ పాదయాత్రలో ఎంఐఎం నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనంసాక్షి

# కుల సంఘాలు కలిసికట్టుగా అభివృద్ధిని సాధించుకోవాలి

**కార్పోరేటర్ కొలుకుల జగన్**

**కుత్బుల్లాపూర్ జనవరి 31 (జనం సాక్షి):** కుల సంఘాలు కలిసికట్టుగా ఉండి ఐకమత్యంతో అభివృద్ధి సాధించుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. డివిజన్ కురుమ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మల్లేష్,యాదగిరి. కురుమ సంఘం సభ్యులు శనివారం మగ్దూంనగర్ లోని కార్పొరేటర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు సరైన ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం సభ్యులకు శాలువాతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కురుమ కులస్తుల సంక్షేమం కోసం తనవంతు సహాయ సహకారాలు అందజేస్తారని హామీ



ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, కురుమ సంఘం నాయకులు శ్రీధర్,సిద్దులు,సభ్యులు శేఖర్, శ్రీనివాస్, ఎర్ర శీను, నరసింహ,వెంకటేష్,శ్రీధర్, కృష్ణ, వీరస్వామి, రాములు బీరయ్య,ఐలయ్య,రాజు, వేణు,భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# గ్రామస్తుల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తాం

- రాంపూర్ గ్రామ సభలో ప్రజా సమస్యల గుర్తింపు
- గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్

**తలకొండపల్లి జనవరి 31(జనంసాక్షి):** గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి,సమస్యలను గుర్తించి ప్రజలందరి సహకారంతో సమస్యలను పరిష్కరిస్తామని సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్ గ్రామంలో పంచాయితీ కార్యాలయం వద్ద పాలకవర్గం గ్రామ ప్రజల ఆమోదంతో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో పలు సమస్యలు సభ దృష్టికి తెచ్చారు.

ముఖ్యంగా వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగునీరు,విద్యుత్తు సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గుర్తించారు. అదేవిధంగా ప్రజలు సూచించిన పారిశుద్ధ్యం,సిసి రోడ్లు మరియు వీధిలైట్లు,ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా అవసరాలను తీర్చాలని గుర్తించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ..నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృతనిచ్చయంతో పనిచేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ తమతో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు, గ్రామ సెక్రెటరీ రమేష్ నాయక్,ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహ,వార్డు సభ్యులు మిద్దెల భార్గవి నందు, సప్పిడి సునీత కృష్ణయ్య,దొరుబాయి లాలమ్మ జంగయ్య, కటికల మధు యాదవ్, తిక్కల జంగయ్య, వట్టెల చంద్రకళ సుధాకర్, కాకి రామచంద్రయ్య, నరేష్, రమేష్, మాజీ సర్పంచ్ యాదయ్య, మాజీ ఎంపిటిసి యాదయ్య,మాజీ ఉపసర్పంచ్ యెన్నం మోహన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు మీసాల ఆంజనేయులు, హరి మోహన్ రెడ్డి, మజీద్, చిన్న హరి మోహన్ రెడ్డి,యువ నాయకులు చిలుకం శేఖర్,బోదాస్ నరసింహ,పబ్బా సంపత్ కుమార్, రొయ్యల మహేష్, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రీడలను జయప్రదం చేయండి : ఎంఈఓ శ్రీనివాస్

**హయత్ నగర్, జనవరి 31 (జనం సాక్షి) :** సీఎం కప్2026 హయత్‌నగర్ మండల స్థాయి టోర్నమెంట్ అండ్ సెలెక్షన్స్ తేదీ 02-02-2026 సోమవారం ఉదయం 9:00 గంటలకు హయత్ నగర్ లోని వర్డ్ అండ్ డీడ్ పాఠశాలకు రావాలని మండల విద్యా అధికారి శ్రీనివాస్, హయత్ నగర్ జోన్ కార్యదర్శి పిడి నిర్మల లు తెలియజేశారు. వాలీబాల్ అండర్ 18, కబడ్డీ ఓపెన్ టు ఆల్ (85 కేజీల లోపు), ఖో ఖో అండర్ 18, ఫుట్ బాల్ అండర్ 16 పోటీ లలో పాల్గొనడానికి అర్హత కల్గిన విద్యార్థులు ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తీసుకొని రావాలి, ఆన్‌లైన్‌లోనమోదు చేసి ఉండాలని, ఫైనల్ సెలక్షన్ టీమ్ ఓన్లీ వన్ టీమ్ అని వారు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- 280 మందికి ఉచితంగా చికిత్స
- చీపునుంతల సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ



**తలకొండపల్లి జనవరి 31(జనంసాక్షి):** ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందించడమే తన లక్ష్యమని చీపునుంతల సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ అన్నారు. శనివారం తలకొండపల్లి మండలంలోని చీపునుంతల గ్రామంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ డాక్టర్స్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చీపునుంతల,తుమ్మలకుంట తాండ గ్రామాల ప్రజలు సుమారు 280 మందికి డాక్టర్లు శృతిక,రిషి,లు కంటి వైద్య పరీక్షలు,జ్వరం,షుగర్,బిపి,పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్స్ మాట్లాడుతూ..చిన్న చిన్న జాగ్రత్తలు పాటించి,ప్రతీ రోజు ఉదయం వ్యాయామం చేస్తూ,సరైన ఆహారం తీసుకోని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు. అదేవిధంగా సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ మాట్లాడుతూ. డాక్టర్లు దైవంతో సమానం అని,ఇలాంటి మంచి కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు అందించడం గొప్ప విషయం అన్నారు. గ్రామ ప్రజలకు ఉచిత వైద్యం అందించిన డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుమ్మడి రాజు, మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్, మాజీ సర్పంచ్ బండి రఘుపతి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మిద్దె చెన్నకేశవులు, వార్డు సభ్యులు వంకూరి శ్రీరామ్, ఎం.రాజు, గుమ్మడి శారదా, ఆల్వాల్ రెడ్డి, అంజమ్మ,రాజు,పంచాయితీ కార్యదర్శి యాదగిరి, జిపిఓ భాగ్యలక్ష్మి, టెక్నీషియన్ టీ.సందీప్, నాయకులు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.







# విద్యతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలి

**చేవెళ్ల, జనవరి 31 (జనంసాక్షి) :** విద్యతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలని చన్వెల్లి గ్రామ సర్పంచి గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి అన్నారు. చన్వెల్లి గ్రామంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి పురన్ దాస్, ఎస్సై వనం శిరీష, గ్రామ సర్పంచి గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ దీపక్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు అత్యంత అవసరమని అన్నారు. మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవడంతో పాటు క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమి ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా మరింత కృషి చేసి విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో దోహదపడిందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.